

కాకో అమ్మవారిని దర్శించుకుంటున్న జీసీసీ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు

# దండారీ సంబురాలు షురూ..

- గుడిరేవు తీరంలో పద్మల్‌పురి కాకో ఆలయంలో ఆదివాసుల ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న గుస్సాడీ నృత్యాలు

దండేపల్లి, అక్టోబర్ 6: మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గుడిరేవు గోదావరి తీరంలో పద్మల్‌పురి కాకో ఆలయం వేదికగా దండారీ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి గిరిజనులు, మహిళలు వచ్చి ఆలయానికి సమీపంలో గోదావరి నదిలో పుణ్య స్నానాలు చేశారు. నది జలాలతో అమ్మ వారికి సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. పాయసంతో పాటు రుబ్బిన పెసరు, మినుములు, బబ్బెర గారెలు, అరిసెలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం మేకలు, కోళ్లు బలి ఇచ్చి వంటలు చేసుకొని సామూహిక భోజనాలు చేశారు. దీపావళి వరకు తమ గూడాల్లో దండారీ ఉత్సవాల్లో పాల్గొంటారు. దీపావళి రెండు రోజుల తర్వాత కోలబోడి వేడుకను నిర్వహించి ఉత్సవాలు ముగిస్తారు.

### ఆకట్టుకున్న గుస్సాడీ నృత్యాలు..

నెత్తిన నెమలి పింఛంతో తయారు చేసిన టోపి, కళ్లద్దాలు, భుజాన జింక తోలు, నడుముకు, కాళ్లకు గజ్జెలు ధరించి, చేతిలో కోలా పట్టుకొని తప్పెట గూళ్ల వాయిద్యాలకు, డప్పు చప్పుళ్లతో వారు చేసిన గుస్సాడీ నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర గిరిజన కో ఆపరేటివ్ ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ కోట్నాక తిరుపతి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కుడిమెత సోము, అడాయి కాంతారావు, లింగారావు, జంగు, శ్రీనివాస్ ఉన్నారు.



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

# అటవీశాఖ ఆధ్వర్యంలో సైక్లోథాన్



సైక్లోథాన్‌లో పాల్గొన్న అటవీ శాఖాధికారులు

దండేపల్లి, అక్టోబర్ 6 : దండేపల్లి మండలం తాళ్లపేట రేంజ్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సైక్లోథాన్ కార్యక్రమం నిర్వహించారు. తాళ్లపేట రేంజ్ కార్యాలయం నుంచి ఊట్ల వరకు చేపట్టారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ.. స్థిరమైన జీవనశైలిని, సైక్లింగ్‌ను ప్రోత్సహించేందుకు వన్య ప్రాణులపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారులు సుష్మారావు, హఫీజుద్దీన్, డీఆర్వోలు, ఎఫ్ఎస్వోలు, ఎఫ్‌బీవోలు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

శనిగకుంట కహానీ



శనిగకుంట చెరువు మత్తడి (ఫైల్)

- విలేకరుల సమావేశంలో స్వయంగా వెల్లడించిన ఏసీపీ వెంకటేశ్వర్
- ఇప్పటివరకు ఆ తహసీల్దార్‌పై చర్యలు శూన్యం
- కోట్ల రూపాయలు చేతులు మారిన ఘటనపై ఈడీ ఫోకస్!


# తప్పు చేసిన తహసీల్దార్‌పై చర్యలేవీ?

## నిబంధనలకు విరుద్ధంగా నాలా పర్మిషన్ ఇచ్చిన రెవెన్యూ అధికారి

మంచిర్యాల, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సంచలనం సృష్టించిన శనిగకుంట మత్తడి పేల్చివేత కేసులో ఎట్టకేలకు అందరినీ అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కీలక సూత్రధారులను తప్పించి, పాత్రధారులను అరెస్టు చూపించారనే విమర్శలు వచ్చినప్పటికీ అవేమీ పట్టించుకోకుండా.. పరోక్షంగా, ప్రత్యక్షంగా సంబంధం ఉన్న 14 మందిని పట్టుకున్నట్లు చూపించారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా అక్టోబర్ 4వ తేదీన జైపూర్‌లో ఏసీపీ వెంకటేశ్వర్ ప్రెస్‌మీట్ పెట్టి వివరాలను వెల్లడించారు. ఈ క్రమంలోనే పోలీసులు శనిగకుంట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోని భూములకు సంబంధించిన ఓ సమాచారాన్ని అధికారికంగా తెలిపారు. జారీ చేసిన ప్రెస్‌నోట్‌లోనూ దాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. అదేంటంటే.. 2022 జూన్ 6వ తేదీన ఇరిగేషన్ డీఈ(సబ్ డివిజన్, చెన్నూర్–2) ఓ నోటీసు ఇచ్చారు. ‘శనిగకుంట పరీవాహక ప్రాంతంలోని సర్వే నంబర్ 355, 356, 357, 358, 359లోని భూమి చెరువు ముంపు ప్రాంతం (ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్)లో ఉంది. ఆ భూమిలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు లేవు. ఈ భూముల్లో అనుమతులు లేకుండా మట్టి పోసి చెరువు సామర్థ్యాన్ని దెబ్బతీసి ప్రభుత్వ ఆస్తికి ఆటంకం కలిగించారు. ముంపు ప్రాంతంలో పోసిన మట్టిని తొలిగించి, యథాతథ స్థితికి తీసుకురానిచో ప్రభుత్వ నిబంధనలు అనుసరించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం..’’ అని బఫర్‌జోన్‌లో మట్టిపోసిన మంచాల రాజబాబుకు నోటీసులు ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ప్రతిని అప్పటి చెన్నూర్ తహసీల్దార్ దేశ్‌పాండే శ్రీనివాస్‌కు కూడా పంపించారు.

### బఫర్‌జోన్ అని తెలిసీ నాలా కన్వర్షన్..

జూన్ 6, 2022న ఇరిగేషన్ డీఈ శనిగకుంట బఫర్‌జోన్ భూములపై సర్వే నంబర్లతో నోటీసులు ఇచ్చారు. అవేవీ పట్టించుకోకుండా చెన్నూర్ తహసీల్దార్ నిబంధనలకు విరుద్ధంగా జనవరి 7వ తేదీ 2023లో బఫర్‌జోన్‌లోని భూములను నాలా కన్వర్షన్ చేశారు. ఈ విషయాన్ని పోలీసులే ప్రెస్‌మీట్‌లో చెప్పారు. కాగా.. బఫర్‌జోన్ భూమిని తహసీల్దార్ ఎలా నాలా కన్వర్షన్ చేశారు? దీని కోసం ఏమైనా అమ్యామ్యాలు ముట్టాయా అన్నది కూడా బయటికి రావాలి. నిబంధనలకు విరుద్ధంగా తహసీల్దార్ నాలా కన్వర్షన్ చేశారని పోలీసులే నిర్ధారించినప్పటికీ రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు సదరు తహసీల్దార్‌పై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. ఇదే చెన్నూర్ నియోజకవర్గంలో చెరువుల బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని నివాసాలకు నోటీసులు ఇచ్చి, మార్కింగ్ చేసిన అధికారులు.. మరీ అందుకు పర్మిషన్ ఇచ్చిన అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనేది అర్థం కావడం లేదు. పోలీసు కేసుతో సంచలనంగా మారిన శనిగకుంట విషయంలో నిబంధనలు అతిక్రమించిన అప్పటి చెన్నూర్ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి అధికారుల కారణంగానే చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని.. కానీ ప్రభుత్వం ఏ ఒక్కరిపైనా చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని వాపోతున్నారు. బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లో ఇండ్లు ఉన్నాయి కాబట్టి వాటిని కచ్చితంగా తొలగిస్తామని చెప్తున్న కలెక్టర్ సారూ.. నాలా కన్వర్షన్లు చేసి, పర్మిషన్లు ఇచ్చిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.



చెన్నూర్ ఇరిగేషన్ డీఈ జూన్ 6, 2022లో తహసీల్దార్‌కు ఇచ్చిన నోటీసు ప్రతి

### కోట్ల రూపాయల డీల్‌పై ఈడీ ఫోకస్ పెట్టేనా?

శనిగకుంట బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ భూమి 15.20 ఎకరాలకు గోదావరిఖనికి చెందిన చెరుకు బుచ్చిరెడ్డి నుంచి 2022లో కొనుగోలు చేసినట్లు పోలీసులు చెప్పారు. ఆ భూమినే అధికార పార్టీ నాయకులు గొడిసెల బాపురెడ్డికి విక్రయించేందుకు రూ.7.50 కోట్లకు అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇందులో ఆయన రూ.4 కోట్లు చెల్లించగా, 4.20 గుంటల భూమి మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యిందని పోలీసులు చెప్తున్నారు. కాగా.. రూ.4 కోట్లు చెల్లించారంటే అది చిన్న అమౌంట్ కాదు. నిబంధనల ప్రకారం 2022–23లో రూ.2.50 లక్షలు దాటిన ఏ క్రయవిక్రయానికైనా ఐటీ చెల్లించాలి. ఇప్పుడు ఈ రూ.4 కోట్లకు బాపురెడ్డి ఐటీ చెల్లించారా? లేదా? అన్న విషయంపై ఈడీ విచారణ జరిపించాలనే డిమాండ్ స్థానికంగా వినిపిస్తున్నది. మరీ దీనిపై ఈడీ ఫోకస్ పెడుతుందా? లేదా? అన్నది వేచి చూడాలి.

# నీటి గుంతలో పడి బాలుడి మృతి

- రైల్వేట్రాక్ నిర్మాణం కోసం గుంత తీసి వదిలేసిన అధికారులు
- న్యాయం చేయాలని మృతదేహంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆందోళన



రాజ్‌కుమార్ (ఫైల్)



రైల్వేట్రాక్‌పై బాలుడి శవంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

జైపూర్, అక్టోబర్ 6: జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో టేకుమట్ల వద్ద ఆదివారం రైల్వేట్రాక్ సమీపంలోని నీటి గుంతలో పడి చిప్పకుర్తి రాజ్‌కుమార్ (14) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..టేకుమట్లకు బర్రెల కాపరి విష్ణువర్ధన్–రమాదేవి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. రాజ్‌కుమార్ ఇందారం ప్రభుత్వపాఠశాలలో9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం తండ్రి బర్రెలను మేపేందుకు గ్రామశివారులోని రైల్వేట్రాక్ వైపు వెళ్లాడు. మధ్యాహ్నం తండ్రికి టిఫిన్ తీసుకొని రాజ్‌కుమార్ వస్తుండగా రైల్వేట్రాక్ సమీపంలోని నీటి గుంతను దాటుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడ్డాడు. అవతల వైపు నుంచి గమనించిన తండ్రి మరో ఇద్దరు నీటిలో దూకి గాలించి బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. సింగరేణి అధికారులు రైల్వే ట్రాక్ కోసం గుంత తీసి ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతోనే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలుడి శవాన్ని రైల్వే ట్రాక్‌పైన ఉంచి ధర్నా చేశారు. జైపూర్ ఎస్ఐ శ్రీధర్, ఏఎస్ఐ నాగరాజు సముదాయించినా వినలేదు. బాధిత కుటుంబానికి ఎస్టీపీపీ యాజమాన్యం రూ.50 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా సాయంత్రం వరకు కూడా యాజమాన్యం స్పందించలేదు. దీంతో గ్రామస్తులు ధర్నా కొనసాగించారు.

# దుర్గామాతకు మాజీ విప్ బాల్క సుమన్ ప్రత్యేక పూజలు



దుర్గామాత మండపంలో పూజలు చేస్తున్న మాజీ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

మందమర్రి, అక్టోబర్ 6: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలోని ఆర్కే–1 మార్కెట్ ఏరియాలో కొలువుదీరిన దుర్గామాతను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదివారం దర్శించుకున్నారు. స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు అమ్మవారి శాలువాను కప్పి ఆయనను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ రమేశ్ రాజా, నాయకులు, కౌన్సిలర్లు రామిడి కుమార్, బీ.సంపత్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కంభగోని సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అ ‘పూర్వ’ సమ్మేళనం



దండేపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్ విద్యార్థులు

దండేపల్లి, అక్టోబర్ 6: దండేపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1998–99 సంవత్సరంలో పదో తరగతి చదివిన వారంతా ఆదివారం పూర్వ విద్యార్థులు సమ్మేళనాన్ని నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత కలిసిన ఆనందంలో ఆ నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా గురువులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

మందమర్రి, అక్టోబర్ 6: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలోని ఏ జోన్ కాలనీలో గల నవోదయ ఉన్నత పాఠశాలలో 2004–05 బ్యాచ్ పదోతరగతి చదివిన వారంతా ఆదివారం మంచిర్యాలలోని ఫంక్షన్ హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 19 ఏళ్ల తర్వాత ఒకే చోట కలిసి చిన్ననాటి స్నేహితులు ఒకరిని మరొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులకు పూలతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.



మందమర్రి : ఆత్మీయ సమ్మేళనంలో నవోదయ పాఠశాల పూర్వ విద్యార్థులు



దీక్షకు వస్తున్న మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ శ్రేణులు



ఖనిలో చౌరస్తాలో దీక్షను భగ్నం చేస్తున్న పోలీసులు

# వాస్తవ లాభాల్లో వాటా కోసం పోరుబాట

## సింగరేణి సంస్థపై బీఆర్ఎస్, టీబీజీకేఎస్ శ్రేణుల కన్నెర్ర

- ఖని చౌరస్తాలో ఒకరోజు శాంతియుత దీక్ష
- దీక్ష భగ్నానికి పోలీసుల యత్నం.. టెంటు వేయకుండా అడ్డగింత
- శాంతియుతంగా చేపడుతున్నామని చెప్పినా ససేమిరా
- పోలీసుల తీరుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించిన మాజీ మంత్రి కొప్పుల, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు
- తిరిగి టీబీజీకేఎస్ కార్యాలయం వద్ద దీక్ష
- కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్

గోదావరిఖని, అక్టోబర్ 6: సింగరేణి కార్మికులకు అండగా బీఆర్ఎస్, టీబీజీకేఎస్ శ్రేణులు కదంతొక్కారు. సింగరేణి 2023–24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన రూ.4,701 కోట్ల వాస్తవ లాభాలపై 33 శాతం వాటాను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గోదావరిఖని చౌరస్తాలో ఒకరోజు శాంతియుత దీక్ష చేపట్టగా, పోలీసులు భగ్నం చేసేందుకు యత్నించారు. టెంటు వేయకుండా అడ్డుతగిలారు. శాంతియుతంగా చేపడుతున్నామని చెప్పినా వినకపోవడంతో పోలీసులు, శ్రేణులకు మధ్య కాసేపు తోపులాట జరిగింది. ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులతో మాజీ మంత్రి కొప్పుల, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, రామగుండం, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, నడిపెల్లి దివాకర్ రావు, పెద్దపల్లి జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి వాగ్వాదానికి దిగారు. శాంతియుత వాతావరణంలో దీక్ష చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడం సరికాదని, అతిగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. పోలీసుల తీరుకు వ్యతిరేకంగా టీబీజీకేఎస్, బీఆర్ఎస్ అక్కడే రోడ్డుపై బైఠాయించారు. నల్ల కండువాలు కప్పుకొని నిరసన తెలిపారు. కాగా, ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు దీక్ష జరుగకుండా పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేయగా, టీబీజీకేఎస్, బీఆర్ఎస్ శ్రేణులు వెనక్కి తగ్గలేదు. సమీపంలోని టీబీజీకేఎస్ కార్యాలయానికి చేరుకొని, ఆవరణలో టెంటు వేసి దీక్ష చేపట్టారు. సింగరేణి, ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

### నికర లాభాలపై వాటా ఇవ్వాల్సిందే

సింగరేణి లాభాల్లో వాటాలో యాజమాన్యం గోల్‌మాల్ చేస్తున్నదని, కార్మికుల శ్రమను దోచుకుంటున్నదని టీబీజీకేఎస్, బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.4,701 కోట్ల నికర లాభాలు సాధించిందన్నారు. 33 శాతం వాటా అంటే కార్మికులకు రూ.1,550కోట్లు వస్తాయన్నారు. కార్మికులను మోసం చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, జనరల్ సెక్రటరీ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, కేంద్ర ఉపాధ్యక్షుడు బడికల సంపత్, ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు వడ్డెపల్లి శంకర్, ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ఆర్జీ–3 ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య, పెట్టెం లక్ష్మణ్, మేడిపల్లి సంపత్, మల్రాజు శ్రీనివాసరావు, బడితెల సమ్మయ్య, ఎల్ వెంకటేశ్, పొలాడి శ్రీనివాసరావు, సత్యం, శేషగిరి, బీఆర్ఎస్ నాయులు డాక్టర్ రాజారమేశ్, నడిపెల్లి విజిత్‌రావు, రవి, కార్పొరేటర్లు గాదం విజయ, కృష్ణవేణి, విజయలక్ష్మీ, కవితా సరోజని, సంధ్యారెడ్డి ఉన్నారు.



నిరసన దీక్షలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు

### ఆందోళనలు చేస్తూనే ఉంటాం.

*సింగరేణి కార్మికులకు వాస్తవ లాభాల వాటా చెల్లించే వరకు పోరాటం ఆగదు. సంస్థ ప్రకటించిన నికర లాభం రూ.4,701 కోట్లపై కార్మికులకు 33శాతం వాటాగా రూ.1,551 కోట్లు చెల్లించాల్సిందే. సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా ఉన్న ఐఎన్టీయూసీలు అధికార కాంగ్రెస్‌కు తొత్తుగా మారిపోయాయి. కార్మికులకు న్యాయం చేయాల్సిన కార్మిక సంఘాలు పట్టించుకోకపోవడం సరి కాదు. ఈ రోజు తాము గోదావరిఖనిలో శాంతియుత వాతావరణంలో నిరసన దీక్షకు పిలుపునిస్తే పోలీసులు వచ్చి అడ్డుకోవడం కాంగ్రెస్ నైజాన్ని తెలియజేస్తుంది.*

– మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు

